క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను శుక్రవారం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి అభినందించారు. జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు బళ్లారిలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో క్రీడాకారులు కిరణ్, మల్లికార్జున ఉత్తమ ప్రతిభ కబరిచి ద్వితీయ స్థానాన్ని కై వసం చేసుకొని సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి బాబు, తదితరులు అభినందించారు.

సర్వేలు వంద శాతం పూర్తి చేయండి



రుద్రవరం సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

రుద్రవరం: సర్వేలు వంద శాతం పూర్తి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి గ్రామ సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని మూడు, నర్సాపురం, ముత్తలూరు గ్రామ సచివాలయాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి ఉదయం 10 గంటలకు బయో మెట్రిక్ హాజరు వేయాలన్నారు. అలాగే హౌస్‌హోల్డ్ జియో ట్యాగ్, ఎంఎస్‌ఎంఈ, చిన్నారుల ఆధార్ సర్వే వంటివి వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మండల పరిషత్ ఏఓ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ షడ్రక్ ఉన్నారు.

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగ అవకాశాలు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో 52 మంది ఉద్యోగ అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంతరెడ్డి తెలిపారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో 5 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు 104 మంది హాజరు కాగా 52 మంది ఉద్యోగ అర్హతలు సాధించారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ సిబ్బంది, సీడ్‌యాప్ సిబ్బంది, మస్తాన్, సుబ్బయ్య, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఉత్తేజ్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆళ్లగడ్డ : జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక విశ్వశాంతి పాఠశాల విద్యార్థి నాగ ఉత్తేజ్ ఎంపికయ్యాడు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో ఉత్తేజ్‌ను పాఠశాల నిర్వాహకుడు శ్రీనాథ్‌రెడ్డి, హెచ్‌ఎం వరలక్ష్మి అభినందించారు.

కొత్తూరుకు రూ.20.96 లక్షల ఆదాయం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, ఫొటోలు, గాజుల దుకాణం నిర్వహించుకునేందుకు ఏడాది పాటు హక్కులు కల్పిస్తూ అధికారులు ఈ బహిరంగా వేలం పాట నిర్వహించారు. రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం టెంకాయల విక్రయ హక్కులకు రూ.15.50 లక్షలకు, పూల దుకాణం నందివర్గం గ్రామానికి చెందిన సుధీర్ కుమార్ రూ.4.77 లక్షలకు హెచ్చు పాడారు. అలాగే గాజులు, ఫొటోల దుకాణాలను కొత్తూరు గ్రామానికి చెందిన సుధీశ్వర్‌రెడ్డి రూ.69,500 కు హెచ్చు పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గతంలో పోల్చితే ఈ ఏడాది స్వామి వారికి రూ.1.37 లక్షల ఆదాయం పెరిగినట్లు తెలిపారు. ఈఓ నరసయ్య, మిలటరీ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడి, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుడిదిన్నె వద్ద గొడుగుల నీడలో పశువుల కాపర్లు

ముదురుతున్న ఎండలు



చిలుకలూరు సమీపంలో చెట్టుకింద సేద దీరుతున్న గొర్రెలు

రుద్రవరం: ఫిబ్రవరిలోనే ఎండలు ముదురుతున్నాయి. ఉదయం కాస్త చల్లగా ఉన్నప్పటికీ 11 గంటలు దాటిన తరువాత ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మధ్యాహ్న సమయం అయితే ఎండ తీవ్రం అవుతోంది. ఎండలకు తాళలేక ప్రజలు, పశువులు నీడ ప్రదేశాలకు చేరుకుంటున్నారు. శుక్రవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఎండలు అధికంగా ఉండటంతో పశువుల కాపర్లు ఉపశమనం పొందేందుకు గొడుగులను వినియోగిస్తున్నారు. గ్రాసం కోసం పశువులను పొలాల్లోకి తోలి గొడుగుల నీడలో నిల్చొని వాటిని మేపుతున్నారు. అలాగే మధ్యాహ్నం అయ్యే సరికి గొర్రెల మందలు చెట్ల కిందకు చేరి ఆ నీడలో సేదదీరుతున్నాయి. ఇప్పుడిప్పుడే ఇంతగా ఎండలు ఇంతగా ఉంటే రానున్న రోజుల్లో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ- శ్రమ్ యోజనతో కార్మికులకు బీమా



నమోదు చేస్తున్న కార్మిక శాఖాధికారి మురళీ కృష్ణ

శిరివెళ్ల: ఈ -శ్రమ్ యోజన ద్వారా కార్మికులకు బీమా వర్తిస్తుందని జిల్లా కార్మిక శాఖాధికారి మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ శ్రమ్ యోజన కింద అసంఘటిత కార్మికుల పేర్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 18–59 ఏళ్ల వయసున్న అసంఘటిత కార్మికులు యోజనలో చేరవచ్చన్నారు. వారు ఏదైన ప్రమాదంలో మరణిస్తే రూ.2 లక్షలు బీమా మంజూరవుతుందన్నారు. ఒక వేళ ప్రమాదంలో అంగవైకల్యం చెందితే వైకల్య శాతం ఆధారంగా రూ. లక్ష నుంచి లక్షన్నర వరకు పరిహారం పొందవచ్చన్నారు. ఇంత వరకు జిల్లాలో 3 లక్షల వరకు కార్మికకులను బీమా యోజనలో చేర్పించామన్నారు. 2021–22లో వివిధ ప్రమాదాలలో మరణించిన 8 మందికి ఒకొక్కరికి రూ. 2 లక్షల బీమాను వారి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. స్థానిక మండలంలో గోవిందపల్లెకు చెందిన వెంకట సుబ్బమ్మ మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు బీమా సొమ్ము అందజేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, సచివాలయాలలో రిజిస్టర్ చేసుకునే సదుపాయం కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వినీకుమార్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓకు అభినందనలు



శంకర్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న జిల్లా కత్వా నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నూతనంగా ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శంకర్ ప్రసాద్ నంద్యాల జిల్లా ఏపీ కాపు టీచర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, నాయకుడు పగడాల శ్రీనివాసరావు, యామప్రసాద్, చంద్రశేఖర్, విశ్వనాథ్, నాగరాజు, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈఓకు సన్మానం

శిరివెళ్ల: మండల విద్యాశాఖాధికారి శంకరప్రసాద్‌కు నంద్యాల డిప్యూటీ ఈఓగా అదనపు బాధ్యతలను డీఈఓ అప్పజెప్పారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవన సిబ్బంది డిప్యూటీ ఈఓను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో విద్యాభివృద్ధికి పాటు పడతానన్నారు. రెండు బాధ్యతలనూ సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



గాంధీచౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల కేంద్ర పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్‌డీపీఐ అసెంబ్లీ అధ్యక్షుడు ఎజాజ్ హుసేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో సవరణ బిల్లు ప్రతులను చింపి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు తెలుగుదేశం పార్టీ, జేడీయూ ఎంపీలు మద్దతు ఇవ్వకూడదని, గతంలో కూటమి నాయకులు మైనార్టీలకు, దళితులకు అండగా ఉంటామని హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని గుర్తుచేశారు. వక్ఫ్ భూములను బీజేపీ ప్రభుత్వం కొల్లగొట్టాలని చూస్తుందని, దానిని టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకించి పార్లమెంట్‌లో బిల్లు ఉపసంహరించుకునేలా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌సమద్, కరీముల్లా, సలాం మౌలానా, హనీఫ్, మజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా భూముల రీసర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

కొలిమిగుండ్ల: పైలెట్ ప్రాజెక్ట్ కింద గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వే వేగవంతంగా జరుగుతోందని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల రెవెన్యూ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డితో కలిసి వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో గత ప్రభుత్వంలో 112 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. ప్రస్తుతం 13 గ్రామాల్లో జరుగుతోందని తెలిపారు. డివిజన్‌లో 217 రెవెన్యూ గ్రామాలున్నాయన్నారు. ఇళ్ల పట్టాలు మంజూరై రెండేళ్ల నుంచి ఎలాంటి నిర్మాణాలు చేయకుండా ఖాళీగా ఉంటే రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్ ద్వారా ఇళ్ల పట్టాలపై సర్వే జరుగుతోందని తెలిపారు. కొత్తగా అర్హులైన లబ్ధిదారులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చేందుకు ఈసర్వే జరుగుతోందన్నారు. గతంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుంటే వాటిని రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఇటిక్యాల రెవెన్యూ పరిధిలో కొన్ని స్థలాల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతులకు పట్టాదారుపాసు పుస్తకాల సమస్య లేదన్నారు. కొద్ది రోజుల నుంచి రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోగా ప్రస్తుతం క్లియర్ అయినట్లు చెప్పారు.

వేడుకగా చౌడేశ్వరి పల్లకీ సేవ



బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్య సమర్పణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బిల్లులు చెల్లించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: మిడ్‌డే మీల్స్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ మిడ్‌డే మీల్స్ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కార్మికులకు అందుతున్న బిల్లులపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నా మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని భోజన నిర్వాహకులు కుమారి, ఎస్తేరమ్మ, శ్రీలక్ష్మి వాపోయారు.

పాదయాత్రికుల సౌకర్యార్థం వైద్యశిబిరాలు

పాములపాడు: శ్రీశైలానికి వెళ్లే పాదయాత్రికుల సౌకర్యార్థం ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు 24 గంటలు పనిచేసేలా కేజీ రోడ్డు వెంట 2 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శివరాత్రి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారన్నారు. వారికి ఎలాంటి వైద్య సేవలు అవసరమొచ్చినా జూటూరు గ్రామం, మండల కేంద్రంలోని హెల్త్ సబ్‌సెంటర్ల వద్ద వైద్యశిబిరాలతో సంప్రదించాలన్నారు.

ఉర్దూ కళాశాల, వసతి గృహాన్ని నిర్మించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఉర్దూ కళాశాలకు భవనాన్ని, వసతి గృహాన్ని త్వరితగతిన నిర్మించాలని రాష్ట్ర ఆల్‌మేవా అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం, అమిరుద్దీన్ కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం మంత్రి ఫరూక్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఉర్దూ కళాశాలలో 120 మంది బాలికలు చదువుతున్నారన్నారు. కళాశాలకు సొంత భవనాలు, వసతి గృహం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద 661 సర్వే నంబరులో ఎకరా స్థలం ఉందని, అక్కడ కళాశాల, వసతి గృహం నిర్మించాలని కోరారు. స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల (ఆర్‌జీఆర్‌)లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంధ్య సూచించారు. 2025 – 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నాల్గవ తరగతి పూర్తి చేసిన బాలికలు 5వ తరగతిలో, 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఐటీ, ఐటీఎస్ తదితర ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు లారీలు ఢీ

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో మలుపు వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. వివరాలు.. శుక్రవారం సాయంత్రం మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దెబ్బతిన్న ఓ లారీ ఇళ్ల వైపు దూసుకెళ్లి గోడను తగిలి ఆగిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని విచారణ చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన వృద్ధురాలు మృతి

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని జోళదరాశికి చెందిన రామక్క(75) గురువారం సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చింది. రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. ఈ ఘటనపై కోవెలకుంట్ల పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆకతాయికి జైలుశిక్ష

మహానంది: బుక్కాపురం గ్రామానికి చెందిన ఈశ్వర్‌సింగ్ ఈనెల 12న మద్యం తాగి దారిలో వచ్చిపోయే వారిపై అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునివ్వడంతో సబ్‌జైలుకు తరలించామన్నారు.

సంజీవయ్య జీవిత చరిత్రను తెలుసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): దామోదర సంజీవయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని బాలచంద్ర సమతా విద్యానికేతన్ చైర్మన్ బాలచంద్రుడు, అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. శుక్రవారం పాఠశాలలో దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటు పడాలన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ కోసం ఈనెల 17న అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో స్థానిక నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి పూజల అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వాల్మీకులందరూ హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, పరమేష్, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాల గ్రామంలో మోడల్ స్కూల్ నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనుల్లో ఆలస్యం జరగకూడదన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు.

హెల్మెట్‌ను భారంగా భావించొద్దు



మాట్లాడుతున్న ఆర్‌టీఓ రవిశంకర్

శిరివెళ్ల: హెల్మెట్‌ను తలకు భారంగా భావించవద్దని ఆర్‌టీఓ రవిశంకర్ అన్నారు. శుక్రవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ వాహన దారులకు రక్షణగా ఉంటుందన్నారు. రోడ్డు ఎక్కితే తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రమాదాలలో తలకు గాయమైతే రక్షించేది హెల్మెటే నన్నారు. చాలా మంది హెల్మెట్ ధరించపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు వారి ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడం వలన కూడ ప్రమాదాలు జరుగుతాయన్నాయన్నారు. మద్యం సేవిండం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం రోడ్డు భద్రతా నియమాలకు విరుద్ధమన్నారు. ప్రతి వాహన దారుడు తప్పని సరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే సురక్షితంగా ఇంటికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పార్వేట



మందలూరులో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట మహోత్సవం కొనసాగుతోంది. ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నె నుంచి ఉత్సవమూర్తుల పల్లకీ గురువారం రాత్రి రుద్రవరం మండలం మందలూరుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం ఈ పల్లకికి గ్రామ సర్పంచు నిర్మలమ్మ, ఎంపీటీసీ వీరశంకరెడ్డి, అధికారులు, గ్రామ పెద్దలు మేళతాళాలతో ఎదురెళ్లి స్వాగతం పలికారు. తర్వాత గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ పల్లకీ మండలంలోని నక్కలదిన్నె గ్రామానికి చేరుకుంది.

రెండో రోజూ కొనసాగిన ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

పగిడ్యాల: నష్టపరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించిన నీటిముంపు నిర్వాసితుల అవార్డుదారుల ధ్రువపత్రాల పరిశీలన రెండో రోజు శుక్రవారం నెహ్రూనగర్‌లో కొనసాగింది. సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన వీరాపురం, ముర్వకొండ గ్రామ అవార్డుదారుల ధ్రువపత్రాల పరిశీలనలో రిటైర్డ్ తహసీల్దార్ విజయుడు పరిహారం పొందే అవార్డుదారుల జాబితాను చదివి వినిపించారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు అందజేయాలని కోరారు. ఒకవేళ మృతి చెందివుంటే వారి వారసులు సంబంధిత డెత్ సర్టిఫికెట్, అఫిడవిట్, ఎన్‌ఓసీ, ఫ్యామిలీ మెంబర్, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు సమర్పించాలని సూచించారు. ధ్రువపత్రాలు సమర్పించిన అవార్డుదారులకు వచ్చే నెల 4న కర్నూలు జిల్లా కోర్టులో చెక్స్ పంపిణీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిర్వాసితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే శనివారం మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిడ్యాల, కొత్త పాలమర్రి గ్రామాల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు హేమలత, వెంకటస్వామి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పల్లకీలో మహానందీశుడి దంపతుల విహారం



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు శరభయ్యాశర్మల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువు తీర్చి వేదోక్తంగా పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం జరిపారు.

'విశిష్ట గుర్తింపు'ను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు ప్రక్రియ చేస్తున్నందున రైతులు ఆధార్, పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లలేని రైతులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఓటీపీతో నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీలోగా విశిష్ట గుర్తింపు కోసం నమోదు చేసుకోవాలని ఏఓ కోరారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలకు అనర్హులవుతారన్నారు.